# కథాకళి



## మల్లాది వెంకట కృష్ణమూర్తి

# పాస్ టైమ్

అది లేడీస్ క్లబ్ మీటింగ్.

"బీదవాళ్ళకి వుచితంగా కళ్ళ పరీక్ష చేయటం మన ప్రాజెక్టులలో ఒకటి" చెప్పింది మిసెస్ షా. ఆవిడ భర్త పెద్ద పారిశ్రామిక వేత్త.

"మా ఆయన ప్రతీ ఆదివారం సాయంత్రం ఆరునించి ఏడుదాకా ఆపని చేస్తారు. వప్పిస్తాను" అని చెప్పింది మిసెస్ దినకర్ రెడ్డి.

"పళ్ళపొడి పొట్లాలు. సబ్బులు నూట అరవైరెండు రూపాయల ఖర్చుతో కొన్నాంగా?" అడిగింది మిసెస్ రోజాక్షి.

"అవునవును. వాటిని ఎవరికిస్తున్నాం?" అడిగింది మిసెస్ థామస్. ఆవిడ భర్త రెండేళ్ళ క్రితం ఎయిర్ క్రేష్‌లో మరణించాడు. ఆవిడే తన భర్త వ్యాపారాలని చూసుకుంటోంది.

"హోమ్ ఫర్ ది ఏజ్డ్ వాళ్ళకి దానం చేస్తున్నాం. తీసుకోడానికి వాళ్ళు వప్పుకున్నారు"

"బీద విద్యార్థులకి పాత పుస్తకాలని సేకరించి దానం చేసే కార్యక్రమం క్రితం మీటింగ్‌లో అనుకున్నది. నలభైఆరు పుస్తకాలని సేకరించాం వాటిని గాంధి విద్యాలయంలోని బీద విద్యార్థులకి ఇవ్వబోతున్నాం" చెప్పింది మిసెస్ షా.

"గండిపేటకి పిక్‌నిక్ ఎప్పుడు?" అడిగింది అరవై ఏళ్ళు పైబడ్డ మిసెస్ కుతూహలం.

"ముందర సహాయ కార్యక్రమాల గురించి మాట్లాడుతున్నాం తర్వాత సోషల్ ఈవెంట్స్" చెప్పింది మిసెస్ దినకర్‌రెడ్డి వెంటనే.

"బ్లడ్ డొనేషన్ కార్యక్రమం ఒకటి అనుకున్నాం?" అడిగింది మిసెస్ సీతామాలక్ష్మి కొద్దిగా భయంగా.

"అవి నెక్స్ట్ మీటింగ్‌లో ఆలోచిద్దాం"


అప్పటికే అది ఆరో నెక్స్ట్.

"ఇవాళ మిసెస్ షా పుట్టిన రోజు. మన క్లబ్ తరపున ఆవిడకి ఒక మెమెంటో ఇస్తున్నాం?" మిగతా సంఘసేవికలు చప్పట్లుకొట్టి ఆవిడని అభినందించారు. ఆవిడ మొమెంటో అందుకుంటుండగా ఫొటో తీసాడు ఫొటోగ్రాఫర్. మిసెస్ సీతామహాలక్ష్మి కూతురు యం బి బి ఎస్ పాస్ అవడంవల్ల ఆవిడకి ఓ మెమెంటో, అమెరికాకి అమెరికన్ ప్రభుత్వ ఆహ్వానం మీద భర్తవెంట వెళ్ళి వచ్చిన ఓ సంఘసేవికురాలికి, పాత క్లబ్ మెంబర్‌కి కొత్తక్లబ్ మెంబర్ చేత ఒక మెమెంటో. కొత్తక్లబ్ మెంబర్‌ని డయాస్ మీదకి తెచ్చిన పాతక్లబ్ మెంబర్ చేత ఓ మెమెంటో ఆ మీటింగ్‌కి ప్రత్యేక అతిథిగా వచ్చిన మరో క్లబ్ సభ్యురాలికి ఓ మెమెంటో. ఆ క్లబ్ స్థాపకురాలికి సిల్వర్‌జూబ్లీని పురస్కరించుకుని ఓ మెమెంటో... ఇలా చాలా ఇవ్వబడ్డాయి. అన్నిసార్లు రెండు కెమేరాలు క్లిక్‌మన్నాయి. తర్వాత సహాయం చేయాలనుకున్న ఆయా సంస్థల నించి వచ్చిన రిప్రజెంటేటివ్స్‌కి పళ్ళపొడి. సబ్బులు. పుస్తకాలు మొదలయిన పేకెట్స్ అందిస్తూండగా, వారు తీసుకుంటూండగా కెమేరాలు క్లిక్‌మన్నాయి

మన కార్యక్రమం పూర్తయింది. కింద సెల్లార్‌లో డిన్నర్‌కి దావలసిందిగా కోరుతున్నాను" మాస్టర్ ఆఫ్ సెరమనీస్ అనౌన్స్ చేసింది మైక్‌లో.

త్రిస్టార్ హోటల్‌లో ఏడో అంతస్థులోని ఆ ఎయిర్‌కండిషన్డ్ కాన్ఫరెన్స్ హాల్‌లోంచి దాదాపు వందమంది సంఘసేవికలు లిఫ్ట్‌లో, నడిచి కింద ఎయిర్‌కండిషన్డ్ సెల్లార్‌లోని బఫే డిన్నర్‌కి వెళ్ళారు.

గంటన్నర తర్వాత వందకార్లు ఆ హోటల్ ఆవరణలోంచి వారిని మోసుకుని నగరంలోని వివిధ ప్రదేశాలకి బయలుదేరాయి. వర్షంలో తడుస్తూ తమకి ఇవ్వబడ్డ కలర్ పేపర్ చుట్టిన పేకెట్లు తడవకుండా అవస్థపడే గాంధి విద్యాలయం హెడ్ మేస్టర్, హోమ్ ఫర్ ది ఏజ్డ్‌లో పనిచేసే వుద్యోగి మొదలయిన వాళ్ళు, పక్కనించి వెళ్ళాయి ఆ కార్లన్నీ, కారుకో రకం సెంటు వాసనని వెదజల్లుతూ.



మర్నాడు పేపర్‌లో వారు చేసిన సహాయాన్ని వివరిస్తూ ఫొటోలు వచ్చాయి

ఆ రాత్రి వాళ్ళ మీటింగ్ ఖర్చు తలకి ఇరవై చొప్పున రెండువేల రూపాయలు!

మెమెంటోల ఖరీదు ఆరువందల నలభై ఏడు రూపాయలు!!

చేసిన ఆర్థిక సహాయం విలువ రెండువందల తొంభై ఆరు రూపాయలు!!! *